# పరిష్కారం

రచన:
తిరుమల పెద్దింటి వరదరాజ్.

''ప్రపంచ ప్రఖ్యాత నటుడు సిల్వెస్టర్ స్టాలెన్. అతనికి ప్రపంచమంతా లక్షలాది అభిమాను లున్నారు.... చిత్రం—అందులో మూడు వంతులు పైగా ఆడవాళ్ళే !'' చెప్పాడు రాకేష్.

''నాకు కావలసింది అది కాదు.'' వెంటనే అన్నాడు భరద్వాజ.

''మరి ?!''

''నాకు మంచి కథకి ప్లాట్ కావాలి.''

''యురేకా....ఎన్నాళ్ళకి గురూ కథకి ప్లాట్ కావాలని అడిగావు !''

భరద్వాజ రాసే కథల కోసం పాఠకు లిప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు.

''ఆగు....మన కథలో పాఠకులకి ఏదైనా ఒక కొత్త విషయం చెప్పాలి.'' అన్నాడు భరద్వాజ.

''అంటే ?'' అడిగాడు రాకేష్ అర్థం గాక.

''అంటే....ఉదాహరణకి 'మల్లాదివెంకటకృష్ణమూర్తి' గారున్నారనుకో. ఆయన తన కథల్లో గాని, నవల్లో గాని ఏదో ఒక దాన్ని గురించి బాగా వివరిస్తుంటారు.... 'ఎక్స్పెర్షన్' అనకూడదు....'ఎక్స్ ప్రెషన్' అనాలి. అన్నైనా కనీసం చెప్తుంటారు... మనంకూడా ఎదైనా....''

''అర్థమయింది గురూ... అలాంటిదైతే నాకథే చెబుతా నుండు !'' అంటూ భరద్వాజ వైపు చూసాడు రాకేష్.

భరద్వాజ ముఖంలో ఏ భావం కనిపించలేదు రాకేష్‌కి. నిజానికి భరద్వాజ రాకేష్ మాటలకే ఆశ్చర్య పోలేదు. కారణం—మంచి రచయితగా పేరు తెచ్చుకుంటున్న అతని దగ్గరకి చాలా మంది వచ్చి ''నా కథ రాయండి.'' అనడ గటమే.

భరద్వాజ రాకేష్ వైపు చూసాడు మామూలుగా. 'రాకేష్' కథ చెప్పటం ప్రారంభించాడు.

* * *

సెక్షన్ హెడ్ ముస్తాఫ్ ఆలీ, ఆచార్యులుగారు కలిసి-మెలిసి ఉండటం చూసి ఆ ఆఫీసులో అందరూ ఆశ్చర్య పోతూంటారు. ఎందుచేతనంటే సింహాచల దేవస్థానంలో పని చేసే సీతారామాచార్యులుగారి అన్నగారికి ముస్తాఫ్ ఆలీతో స్నేహం ఏమిటా ? అని.

కానీ వారికి తెలీదు. వారిద్దరూ అన్యోన్యంగా ఉండటానికి కారణం - వారిద్దరూ వారి వారి మతధర్మాలని నిర్వర్తించటం చేతే దగ్గరయ్యారని.

పైగా వారిద్దరూ ఆలోచించే ధోరణే !

'ఎవరి మతం - ఎవరి ఆచారం వారిది....అంతమాత్రం చేత ఎదుటివారి మతాన్ని, ఎదుటివారి ఆచార వ్యవహారాల్ని, సంప్రదాయాల్ని కించపరచ కూడదు.' అది వారి దృష్ట పథం....అందుకే వారంత దగ్గరయ్యారు.

ఆలీకి ఆచార్యులుగారంటే చెప్పలేనంత ఇష్టం. పైగా గౌరవం కూడా.

ఆలీ, ఆచార్యులుగారు ఆఫీసులో లేనప్పుడు, వారి డెస్క్‌లో ఉండే గాజుగ్లాస్ కూడా ఎవరినీ ముట్టుకో నియ్యడు.

ఆచార్యులుగారు త్రాగే గ్లాసులో మీరు త్రాగటమేమిటని- వీళ్ళు ?

ఆ రోజు —

ఆలీ ఆచార్యులుగారి బెంచీ దగ్గరకొచ్చి, ఫైల్లో బుర్ర పెట్టి ఎదో చదువుకుంటున్న అతన్ని ఉద్దేశించి—

''ఆచారిగారూ !'' అని పిలిచాడు.

ఆచార్యులుగారు బుర్ర ఎత్తి చూసి గతుక్కుమన్నారు. ఎదురుగా సెక్షన్ హెడ్ ! ఆచార్యులుగారు లేచి నుంచున్నారు.

''కూచోండి.'' అంటూ తను కూడా ఎదుటికుర్చీలో కూచున్నాడు ఆలీ.

''మీరు నాకో సహాయం చేసిపెట్టాలి.'' అన్నాడు ఆలీ కొంత సేపటికి.

ఆచార్యులుగారు ఆ మాటలకి ఆశ్చర్య పోలేదు. ఎందు చేతనంటే, ఆచార్యులుగారు 'సింహాచలం' లో ఉండటం చేత, 'ఎవరో పెద్ద ఆఫీసరొస్తున్నాడు - దైవ దర్శనం చేయించండి' అనో, లేదా 'మాకో పనసకాయ తెప్పించండి' అనో, లేదా 'సంపెంగ పూలు కావాలండీ' అనో అనటానికి ముందు....'నాకు సహాయం చేసిపెట్టాలి' అని అంటూంటారు.

కానీ అతని అనుమానం తప్పని అతనికి మరో నిముషం తరువాత తెలిసింది.

"చెప్పండి !" అడిగారు ఆచార్యులు - తప్పకుండా చేస్తాను అన్న ధోరణితో.

"మీకు సాయంత్రం ఏదైనా పనుందా ?" క్రాస్ ఎగ్జామిన్ చేసే లాయర్‌లా అడిగాడు ఆలీ.

"అబ్బే, అలాంటిదేం లేదు ..." చెప్పారు ఆచార్యులు గారు.

"అయితే సాయంత్రం మీరు నాతో ఒక చోటుకి రావాలి !" అన్నాడు ఆలీ.

"ఓ, తప్పకుండా!" అన్నారు ఆచార్యులుగారు "ఎక్కడికి?" అని అడగాలనిపించినా అడగకుండా.


అతన్ని సస్పెన్స్‌లో ఉంచటం ఇష్టంలేదన్నట్లు అతనే చెప్పాడు.

"మా అమ్మాయికి పెళ్ళి సంబంధం చూశాను.... ఆవిడతో ఒకసారి మాట్లాడాలి."

"అంటే ?" అడిగారు ఆచార్యులుగారు.

"అబ్బే, మీరేం మాట్లాడవక్కరలేదు.... కేవలం నాకు ధైర్యంకోసం" అన్నాడు ఆలీ.

ఆచార్యులుగారు 'సరే' నన్నారు గాని అతని మనసు కారణంకోసం శోధిస్తోంది.


మీ పొడుగును పెంచుకోండి !
ఇంతవరకు పొట్టివారికి గౌరవంలేదు. చూచేవారు చులకనగా చూస్తారు. పొట్టితనం ఏ కారణం వలన వున్నా భయపడ నవసరం లేదు. పొట్టిగానున్న స్త్రీలుగాని, పురుషులు గాని, 50 వయసున్నా తన పొట్టితనాన్ని 2 నుండి 10 అం॥ వరకు మా మందునువాడి పెంచుకోవచ్చు. వెల రు 66. త. ఖర్చు రు 10. గ్యారంటీ: మామందుపూర్తికోర్సు వాడి సంతృప్తిచెందనిచో మీ డబ్బులో త. ఖ. మినహాయించి వాపసు చేయబడును.
Write for V.P.P. in English.
MEHRA CLINIC,
154, Islamabad, P. O. Khalsa College, Amritsar—143 001.



నన్ను రమ్మనటానికి కారణం ఏమై ఉంటుంది ?

స్కూటరుందనా ?

అబ్బే అలాంటిదేంకాదు ... స్కూటర్లు ఆ ఆఫీసులో చాలామందికున్నాయ్. సెక్షన్ హెడ్ కనుక, ఎవర్ని పిలిచినా పువ్వుల్లో పెట్టి తీసుకెళతారే !!

మరి ?!

కొద్ది క్షణాల్లో అతనికి కారణం బోధపడింది. ఆచార్యులుగారు ఎక్కడికి పోతే ఆ పనయి తీరుతుంది. అది ఆచార్యులుగారి మాట చాతుర్యం.

అంతే కాదు.

ఆలీ సెంటిమెంట్ !!

* * *

కలెక్టరాఫీసు డౌన్‌లోంచి ఆచార్యులుగారు డ్రైవ్ చేస్తున్న స్కూటర్, వెనుక కూచున్న ఆలీ చెప్పిన డైరక్షన్‌లో నడుస్తోంది. ఆచార్యులుగారు నడపటం వలన.

ఆచార్యులుగారికీ స్కూటరిబ్బందిగా ఉంది. ఇంతకు మునుపు 'రాజ్‌దూత్' ఉండేటప్పుడు హాయిగా ఉండేది. కానీ అది చాసిస్ బ్రేక్ అవటంతో అమ్మేసారు.

"ఆచారిగారూ!.....అదిగో ఆ బిల్డింగే. అక్కడాపండి" అంటూ కుడిచేతిప్రక్కనున్న ఎత్తయిన పచ్చ బిల్డింగ్ వైపు చూపించాడు ఆలీ.

ఆచారిగారు న్యూట్రల్‌చేసి, సెల్ఫ్ ఆపేసి, స్కూటర్ ఒకప్రక్కగా పార్కుచేసారు.

ఆలీ వెనుకగా ఆచారిగారు నడుస్తున్నారు.

"లాక్ చేసేసారా ?" అడిగాడు ఆలీ.

"ఓ.... హేండిల్ లాక్‌తో బాటు, ఇంజెన్ లాక్ కూడా వేసేసాను !" చెప్పారు ఆచార్యులుగారు.

ఎందుకంటే ఆ ప్రాంతంలో స్కూటరు దొంగతనాలు ఎక్కువ.

ఆలీ నాలుగు మెట్లెక్కి కాలింగ్ బెల్ నొక్కాడు.

ఆచార్యులుగారి ప్రక్కనున్న అల్షేషియన్ డాగ్ వారి వైపు చూస్తోంది. కానీ ఏం చెయ్యలేదు. కారణం— వారిలో ఎటువంటి 'సినో ఫోబియా' లేకపోవటమే.

'ఫోబియా' అంటే భయం. కుక్కలని చూసి భయపడటాన్ని 'సినోఫోబియా' అంటారు.

కొంత సేపటికి తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా కాలువ కప్పుకొని నిలబడిం దామె. ఆమెకి సుమారు ఏభై అయిదేళ్ళుండచ్చు. ఆలీని చూడటంతోటే నవ్వుతూ లోపలి కాహ్వానించిందామె.

ఆచార్యులుగారికి ఆమెని పరిచయం చేశాడు ఆలీ.

ఆమె ఆచార్యులుగారితో కొంత సేపు 'తిరుప్పావై' గురించి, 'విష్ణు సహస్రనామం'లో ఉండే ప్రతి శ్లోకం యొక్క ప్రత్యేకతను గురించి చర్చించింది.

దుర్ముహూర్తం లేకపోవటం గమనించి, ఆచార్యులు, ఆలీని తనొచ్చిన పని వివరించమన్నాడు. ఆలీ తన పని గురించి వివరంగా చెప్పాడు నవ్వుతూ.

కొన్ని క్షణాల తరువాత ఆమె అంది. ఆలీ నుద్దేశించి, "మీ గురించీ, మీ కుటుంబం గురించీ నాకు కొన్ని సంవత్సరాలుగా తెలుసు. ఆ కారణంచేత మీ అమ్మాయిని నా కోడలిగా చేసుకోవడానికి నాకు కానీ, భర్తగా అవటానికి మీ అబ్బాయికి కానీ ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ...." అంటూ ఆగిపోతుంది.

ఆలీ చెప్పమన్నట్టు చూసాడు ఆమె వంక.

"మీకు 'తాత' అని పిలిపించుకునే అదృష్టం ఉండదు." మెషిన్ గన్ నుండి వెలువడే బుల్లెట్స్‌లా వెలువడ్డాయి ఆమె నోటి నుండి మాటలు.

ఆ మాటలకి ఆచార్యులుగారు కూడా ఆశ్చర్యపోయారు.

"వాట్ డు యూ మీన్ ?" ఆశ్చర్యం నుండి తేరుకోలేక అడిగాడు ఆలీ.

"అవును....మీ అబ్బాయికి పిల్లలు పుట్టే అవకాశం లేదు. వాడికి వెటర్నిటీ ఆపరేషన్ చేయించేసాను." చెప్పింది ఆమె.

'ఎందుకు ?' అని అడగకుండానే చెప్పసాగింది.

"నే నొకసారి చావుబ్రతుకుల్లో ఉండగా నిష్కర్షగా, నా చేతి బంగారుగాజులు కట్ చేసి అమ్మేసాడు....అంతే కాదు - మా యింట్లో బీరువాలో డబ్బులు, చిల్లర దొంగతనాలు ఎన్నో చేసాడు. నిజానికి ఈ అస్థంతా వాడిదే. వాడలా చెయ్యవలసిన పనే లేదు !"

"దానికి శిక్షగా పిల్లలు పుట్టకుండా చేసారా ?" అడిగాడు ఆలీ.

ఆలీ మొహంలో ఆతృత కొట్టవచ్చినట్టు కనబడుతోంది.

"నేను వాడికి శిక్షగా ఏం విధించలేదు. వాడంగీకారంతోటే ఈ పని చేశాను. కాకపోతే చిన్నగా వివరించానంతే. ఎలాగంటే ... ఒరేయ్ నీ రక్తంలో దొంగతనమనే జీన్ ప్రవేశించింది. ఆ 'జీన్' నీకు మరో ముగ్గురు దొంగల్ని పుట్టిస్తుంది. ఆ ముగ్గురికి ముగ్గురేసి దొంగలు పుట్టారనుకో. వారికి కొంతమంది.... ఇలా కొంతకాలానికి లోకమంతా దొంగలే అయిపోతారు. ఈ తప్పు నీదికాదులే కానీ...." అని చెప్పబోతున్న ఆమెని ఆలీ ప్రశ్నించాడు.

"ఈ తప్పు అతనిది కాదా. మరెవరిది ?"

"నాది."

ప్రక్కలో బాంబుపడ్డట్టుంది ఆ సమాధానం.

"అవును....ఆ తప్పు నాదే. మావారు చెబుతున్నా వినకుండా పిల్లవాడు పుష్టిగా ఉండాలన్న దృష్టితో ఒకామె పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోకుండా, ఆమెచేత మా అబ్బాయికి పాలిప్పించేదాన్ని" చెప్పిందామె.

"మీ అబ్బాయేం చదువుకున్నాడు. ఈ పని కొప్పుకున్నాడంటే 'సైన్స్'తో చాలా సంబంధం ఉన్నవాడై ఉండాలే" అన్నారు ఆచార్యులుగారు.

"చదివింది బి.ఎస్.సి. కానీ యండమూరి నవలలు చదువుతూంటాడులెండి." చెప్పిందామె

ఆలోచనలోంచి తేరుకున్నవాడిలా అన్నాడు ఆలీ—

"మాకేం అభ్యంతరంలేదు.... అంతగా వారికి పిల్లల మీద అభిమానముంటే ఏ అనాథ శరణాలయం నుంచైనా, వారికి నచ్చిన పిల్లాడ్ని తెచ్చి పెంచుకోవచ్చు."

"ఈవిధంగా అయితే వారికి కావలసినది అమ్మాయైతే అమ్మాయి, అబ్బాయైతే అబ్బాయిని తెచ్చుకోవచ్చు ... అదే మామూలు అయితే...." నవ్వుతూ చెప్పిందామె.

"ఎందుకైనా మంచిది. అమ్మాయి నొకసారి కనుక్కోండి" వెళిపోతూంటే చెప్పింది.

* * *

"ఇంతకీ నీకూ ఆ కథకి సంబంధం ఏంటి ?" అడిగాడు భరద్వాజ.

"నేనే ఆమె కుమారుడ్ని" చెప్పాడు రాకేష్.

"అంటే ఇప్పటి నీ భార్య ?"

"ఆమె. 'ఆలీ'గారు మా మావగారు."

"అయితే మీకు పిల్లలు పుట్టరా ?"

"పుడతారు. నే నామెని సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించాను. వారు మంచి 'జీన్స్' ఆమెలోకి ఎక్కిస్తారు. ....ఆ విధంగా మాకు మంచి సంతానం కలగచ్చు....మతా సమస్యకి అంతకంటే మంచి పరిష్కారం కనిపించలేదురా" చెప్పాడు.

భరద్వాజ అతని ముఖంలోకి కళ్ళనీళ్ళతో చూస్తున్నాడు.

ఏ భావంలేని రాకేష్ ముఖం మాత్రం ప్రశాంతంగా ఉంది.

(ఇందులో పాత్రలు, సన్నివేశాలు కేవలం కల్పితం, ఎవరినీ ఉద్దేశించి రాసినవి కావు.)